# పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



ఎంపీడీవో రామకృష్ణకు ఫొటోను బహుకరిస్తున్న యువకులు

కులకచర్ల, నవంబర్ 21 : పర్యావరణాన్ని కాపాడాలని కులకచర్ల ఎంపీడీవో రామకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో కులకచర్ల గ్రామానికి చెందిన భరత్‌కుమార్, ఉత్తమ్‌కుమార్ అనే యువకులు పర్యావరణ పరిరక్షణ కోసం తయారు చేసిన ఫొటోను ఎంపీడీవోకు బహూకరించారు. ఈ సందర్భంగా ఆయన యువకులను అభినందిస్తూ ప్లాస్టిక్‌తో పర్యావరణానికి ముప్పువాటిల్లుతుందన్నారు. గ్రామాల్లో ఈ విషయంపై అవగాహన కల్పించేందుకు తమవంతు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

# ఘనంగా స్వయంపాలనా దినోత్సవం



కులకచర్ల, నవంబర్ 21: మండల పరిధిలోని అంతారం ప్రాథమికోన్నత పాఠశాలలో స్వయం పాలనా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. విద్యార్థులు వివిధ హోదాల్లో తమ బాధ్యతలను నిర్వహించి పలువురిని ఆకట్టుకున్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు హన్మంతు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భూదేవి, వెంకటయ్య, లావణ్య, కవిత, శ్రావణికుమారి, రోహిన్‌కుమార్, వెంకటయ్య పాల్గొన్నారు.



నవాబుపేట, నవంబర్ 21: పశుగణనలో భాగంగా పశువైద్యులు, ఏడీ విజయలక్ష్మి మండల పరిధిలోని చించల్‌పేట గ్రామంలో ఎమ్మెల్యే యాదయ్య ఇంటికి వెళ్లి పశువుల వివరాలను సేకరించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న నూతన పశు వైద్యా కేంద్ర నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ప్రహరీ, సంబంధిత పనులకు అవసరమైనా నిధులను మంజూరు చేయాలని ఎమ్మెల్యే యాదయ్య దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు ఏడీ తెలిపారు. కార్యక్రమంలో పశు వైద్యులు అర్షద్, హాజీ పాల్గొన్నారు.

# కార్లు అద్దెకు తీసుకుని.. తాకట్టు పెట్టి

వెంగళరావునగర్, నవంబర్ 21: కారు అద్దెకు తీసుకొని యజమానికి తెలియకుండా మరో చోట తాకట్టు పెట్టి ఓ ఇద్దరు ప్రబుద్ధులు కొత్త రకం మోసాలకు తెరలేపారు. ఆంధ్రప్రదేశ్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు చెందిన సూర్యతేజకు ఓ ప్రైవేట్ కార్యాలయంలో ఫ్రంట్ ఆఫీస్ ఎగ్జిక్యూటివ్ గా పని చేసేవాడు. అరవింద్,మధు అనే ఇద్దరు సూర్యతేజ వద్దకు వచ్చి కార్లను అద్దెకు తీసుకుని హైదరాబాద్ లోని పెద్ద కంపెనీలకు అద్దెకు ఇచ్చి కార్ల యజమానులకు ప్రతి నెలా డబ్బిస్తామని చెప్పారు. దీంతో సూర్యతేజ జూన్ 6వ తేదీన నగరానికి వచ్చి యూసుఫ్ గూడ లో తన కారును మధుకు అప్పచెప్పాడు. మొదట్లో 3 నెలల పాటు అరవింద్ ద్వారా మధు రూ.40 వేలు సూర్యతేజకు చెల్లించాడు. తనకు మరిన్ని కార్లు అవసరమని అరవింద్ చెప్పడంతో ఇదే విషయాన్ని సూర్యతేజ తన ఇతర మిత్రులతో అరవింద్ వద్దే కార్లు అద్దెకు పెట్టించాడు. వారికి కూడా ఒకట్రెండు నెలలు డబ్బు చెల్లించి ఆ తర్వాత అరవింద్, మధులు డబ్బులు ఇవ్వకుండా ముఖం చాటేశారు. ఈ నేపథ్యంలో కారులో అద్దెకిచ్చిన వారిలో ఒకరైన యోగిరాజు తన కారు శంషాబాద్‌లో ఉన్నట్లు జీపీఎస్ ద్వారా కనుక్కొని అక్కడికి వెళ్లి చూడగా నంబర్‌ప్లేట్ కనిపించలేదు. కారు ఆగి ఉన్న బేకరీ యజమానిని ఇదే విషయాన్ని ప్రశ్నించగా ..మధు అనే వ్యక్తి తన వద్ద కారును తాకట్టు పెట్టి 1.20 లక్షలు తీసుకున్నట్టు చెప్పడంతో బాధితులైన కారు యజమానులు అరవింద్, మధులను నిలదీశారు. దీంతో నిందితులు ఫోన్లు స్విచాఫ్ చేసుకొని పరారయ్యారు. బాధితులు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# పాతకక్షలతో పండ్ల వ్యాపారి దారుణ హత్య

సైదాబాద్, నవంబర్ 21: పండ్లవ్యాపారం చేసుకుంటున్న ఓ యువకుడిని పాతకక్షలు బలితీసుకున్నాయి. ఈ ఘటన సంతోష్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్ ఎంబీ హట్స్‌కు చెందిన మహ్మద్ మోహిత్‌ఖాన్ (18) పండ్ల వ్యాపారం చేస్తుంటాడు. బుధవారం రాత్రి ఒవైసీ కాలనీలోని బర్హాన్‌షా దర్గాలో జరుగుతున్న ఉర్సు ఉత్సవాలకు స్నేహితులతో కలిసి హాజరయ్యాడు. ఉర్సు ఊరేగింపు ఒవైసీ కమాన్ వద్దకు రాగానే గుర్తు తెలియని వ్యక్తులు మోహిత్ ఖాన్ అడ్డగించి కత్తితోదాడి చేసి అక్కడి నుంచి పరారయ్యారు. రక్త మడుగులో పడి ఉన్న ఆతన్ని స్థానికుల సహాయంతో పోలీసులు చికిత్స నిమిత్తం ఒవైసీ దవాఖానకు తరలించగా, పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లుగా ధృవీకరించారు. సంఘటనాస్థలాన్ని సంతోష్‌నగర్ డివిజన్ ఏసీపీ గౌస్‌ఖాన్, ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పరిశీలించి వివరాలను సేకరించి దర్యాప్తు చేస్తున్నారు

# మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలి

పరిగి, నవంబర్ 21: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మత్స్యకారుల అభివృద్ధికి కృషి చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి ముకుంద నాగేశ్వర్, జిల్లా కార్యదర్శి దేశమోని మాణిక్యం డిమాండ్ చేశారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా గురువారం తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో బడుగు, బలహీనవర్గాల అభ్యున్నతికి పోరాడిన పండుగల సాయన్న, కృష్ణస్వామి ముదిరాజ్‌ల విగ్రహాలకు పూలమాలలు వేసి ముదిరాజ్ సంఘం జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధికి ఉచిత చేప పిల్లల పంపిణీ చేస్తున్న సందర్భంలో జరుగుతున్న అవకతవకలను అధిగమించేందుకు సొసైటీలకే నగదు బదిలీ చేయడం ద్వారా మత్స్య సొసైటీలు బలోపేతం కావడానికి అవకాశం ఇవ్వాలన్నారు. గ్రామాల్లో చెరువుల విస్తీర్ణంతో సంబంధం లేకుండా మత్స్యకార కులాల వారందరికీ మత్స్య సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. దేశానికి సంపద సృష్టిస్తున్న ఉత్పత్తి కులాల సమ్మిళితమైన బీసీ వర్గాలకు 50శాతం రిజర్వేషన్లను చట్టసభలలో, ఉద్యోగ, ఉపాధి, విద్యా రంగాల్లో అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు అనంతయ్య, జనార్దన్, నారాయణ, నరేశ్, సత్తయ్య, రమేశ్ పాల్గొన్నారు.



పండుగ సాయన్న, కృష్ణస్వామి ముదిరాజ్‌ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

# నియోజకవర్గ సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తా

ధారూరు,నవంబర్ 21; నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని, జిల్లాలో నూతన పరిశ్రమలను స్థాపించి యువతీ యువకులకు ఉద్యోగాలు కల్పించడానికి కృషి చేస్తానని రాష్ట్ర శాసన సభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. గురువారం ధారూరు మండల పరిధిలోని నాగసముందర్, ధారూరు మండల కేంద్రంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు, మండల కేంద్రంలో ధారూరు పీఏసీఎస్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన గోదాం, రైస్‌మిల్ ను ప్రారంభించారు.అనంతరం మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 56మందికి కల్యాణలక్ష్మి/షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక అభివృద్ధి కి మంచి అవకాశాలు ఉన్నాయని, టూరిజం ప్రమోషన్ ద్వారా స్థానిక ప్రజలకు ఉపాధి కల్పించ డానికి ప్రయత్నాలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ధారూరు పీఏసీఎస్ చైర్మన్ సత్యనారాయణ రెడ్డి, వైస్ చైర్మన్ రాజూ నాయక్, హరిదాస్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణ, డీసీసీ డైరెక్టర్ కిషన్‌నాయక్,వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్‌కుమార్, తహసీల్దార్ షాజిదాబేగం, డిపూటీ తహసీల్దార్ విజయేందర్, ఎంపీడీవో నర్సింహులు, ఎంపీవో షఫీఉల్లాఖాన్, పీఏసీఎస్ సీఈవోలు నర్సింహులు లు, రవీందర్, నాయకులు హన్మంత్ రెడ్డి, వడ్ల నందు, రాంచంద్రా రెడ్డి, మాన్‌సింగ్, రాములు, నాయకులు అధికారులు, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



గోదాం,రైస్ మిల్లును ప్రారంభిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

# హవాలా నగదు 22 లక్షలు పట్టివేత

సుల్తాన్‌బజార్,నవంబర్ 21. కోఠిలోని గుజరాతి గల్లీలో పోలీసులు గురువారం 22 లక్షల రూపాయల హవాల నగదును స్వాధీనం చేసుకున్నారు. సుల్తాన్‌బజార్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి తెలిపిన వివరాల ప్రకారం మొఘల్‌పురా ప్రాంతానికి చెందిన ఫర్నీచర్ వ్యాపారి మహ్మద్ అబ్దుల్ ఖయ్యూం(47), గుజరాతి గల్లీలోని పద్మావతి ఎలక్ట్రానిక్ షాప్ వ్యాపారి ఉత్తమ్ కుమార్(34), సుల్తాన్‌బజార్‌కు చెందిన లలిత్ సింగ్(32)లు ఒక వద్ద గుమిగూడారు. విశ్వసనీయ సమాచారం మేరకు సాయంత్రం 5 గంటల ప్రాంతంలో కానిస్టేబుళ్లు దీపక్, మచ్చగిరి, నవీన్‌రెడ్డి, హెచ్‌జీలు కృష్ణమూర్తి, రాధాకృష్ణల తో కలిసి సీఐ శ్రీనివాసాచారి నిఘా ఉంచారు. అదే సమయంలో వారి వద్ద ఉన్న బ్లూ కలర్ బ్యాగు అనుమానాస్పదంగా కనిపించడంతో వెంటనే వారి వద్దకు చేరుకొని తనిఖీ నిర్వహించగా ఆ బ్యాగులో 22 లక్షల నగదు లభ్యమైంది. ఇందుకు సంబంధించి వారి వద్ద ఎలాంటి ఆధార పత్రాలు లేకపోవడంతో 22 లక్షల నగదును స్వాధీనం చేసుకొని ఆదాయపు పన్ను డైరెక్టర్‌కు అప్పగించామని చెప్పారు.

# మానవత్వం చాటుకున్న ఉద్యోగి

## దొరికిన పర్సు పోలీసులకు అప్పగింత



పూజ, గణేశ్‌లకు బంగారం, నగదు అందజేస్తున్న దృశ్యం

పరిగి, నవంబర్ 21 : విద్యుత్ ఉద్యోగి మానవత్వం చాటుకున్న ఘటన పరిగి పట్టణంలో గురువారం జరిగింది. పరిగి మండలం ఖుదావంద్‌పూర్ గ్రామానికి చెందిన కురువ మల్లేష్ విద్యుత్ శాఖలో పనిచేస్తున్నాడు. పరిగిలోని ఓ బిర్యానీ సెంటర్ వద్ద గురువారం అతడికి ఒక పర్సు లభించింది. ఆ పర్సును తెరిచి చూడగా అందులో 2 తులాల బంగారు చైను, రూ.2వేలు నగదు ఉన్నాయి. వెంటనే అతడు ఆ పర్సును తీసుకువెళ్లి బంగారు ఆభరణం, నగదును ఎస్ఐ సంతోష్‌కుమార్‌కు అందజేశారు. ఇదిలావుండగా కులకచర్ల మండలం ఎర్రగోవింద్‌తండాకు చెందిన ముడావత్ పూజ, గణేశ్ ఈ పర్సు పోగొట్టుకున్నారు. ఈ మేరకు గురువారం సాయంత్రం పరిగి పోలీస్‌స్టేషన్ ఆవరణలో బాధితులు పూజ, గణేష్‌లకు బంగారం, రెండువేల రూపాయల నగదును ఎస్ఐ సంతోష్‌కుమార్ చేతులమీదుగా అందజేశారు.

## జీతాలు రావట్లేదు..

# ఇల్లు గడిచేదెట్లా..?

**మాజీ మంత్రి పి.సబితారెడ్డిని చూసి గోడు వెళ్లబోసుకున్న గొల్లూరు గ్రామ పంచాయతీ సిబ్బంది**

**సంబంధిత అధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చిన ఎమ్మెల్యే**

బడంగ్‌పేట, నవంబర్ 21: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి వేతనాలు రావడం లేదని గొల్లూరు గ్రామ పంచాయతీ సిబ్బంది మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డికి చెప్పి కన్నీటి పర్యంతమయ్యారు. మహేశ్వరం మండలం గొల్లూరు గ్రామం మీదగా మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి వెల్తున్న విషయాన్ని పంచాయతీ సిబ్బంది చూశారు. సిబ్బంది దీనంగా నిలబడిన విషయాన్ని గమనించిన ఎమ్మెల్యే కాన్వాయిని ఆపి వారిని పలకరించారు. ఎమ్మెల్యేను చూసి వారు కన్నీటి పర్యంతం కావడంతో.., ఆమె ఏం జరిగిందని వారిని అడిగారు. కొన్ని నెలల నుంచి గ్రామ పంచాయతీ నుంచి జీతాలు రావడం లేదని, రాకపోతే ఎలా బతకాలని వారు గోడు వెల్లబోసుకున్నారు. ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శికి ఫోన్ చేయడంతో ఆయన ఎమ్మెల్యే ఫోన్ లిఫ్ట్ చేయలేదు. వేతనాలు రాకపోవడంతో ఇబ్బందిగా ఉందన్నారు. ఎలాగైనా తమ సమస్యను పరిష్కరించాలని ప్రాధేయపడ్డారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించే విధంగా చొరవ తీసుకుంటానని ఆమె వారికి భరోసా ఇచ్చారు. సిబ్బందిని ఓదార్చి, ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు. కాంగ్రెస్ పాలనలో ఎవ్వరూ ప్రశాంతంగా లేరన్నారు.



ఎమ్మెల్యే సబితారెడ్డికి ఇబ్బందులు చెబుకుంటున్న గొల్లూరు గ్రామ పంచాయతీ సిబ్బంది

# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మర్పల్లి జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అమరేశ్వరి

మర్పల్లి, నవంబర్ 21 :యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పట్లూర్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ అమరేశ్వరి అన్నారు.. గురువారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులు మంచి అలవాట్లు కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, సిబ్బంది, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# చెకుముకి సైన్స్ పోటీల్లో జిల్లా స్థాయికి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ మక్సూద్ అలీ

కొడంగల్, నవంబర్ 21: జన విజ్ఞాన వేదిక, తెలంగాణ–చెకుముకి సైన్స్ సంబురాల్లో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పోటీలు నిర్వహించారు. ఇందులో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌కు చెందిన ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు అబ్దుల్ బాసిత్, అరుణ్ కుమార్, సుమయ్యా ఫాతిమా జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆ పాఠశాల ప్రిన్సిపాల్ మక్సూద్ అలీ విద్యార్థులను అభినంధించారు.

# మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



మాలల సింహగర్జన వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న నాయకులు

పరిగి, నవంబర్ 21 : డిసెంబర్ ఒకటో తేదీన హైదరాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాలమహానాడు పరిగి డివిజన్ అధ్యక్షుడు నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు చందు కోరారు. గురువారం పరిగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సింహగర్జన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింహగర్జనకు నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుంచి మాలలు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు వెంకటయ్య, జిల్లా అధికార ప్రతినిధి రాములు, నాయకులు శివశంకర్, ఆనంద్, వెంకటయ్య, కృష్ణయ్య, యాదయ్య పాల్గొన్నారు.

# లిఫ్ట్‌గుంతలో పడి వ్యక్తి దుర్మరణం

బంజారాహిల్స్, నవంబర్ 21: ప్రమాదవశాత్తూ భవనం మీద నుంచి లిఫ్ట్ గుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. మరో వ్యక్తి గాయాలపాలయ్యాడు. ఈ ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బిహార్‌కు చెందిన మహ్మద్ తయూమ్ మియా(36) అనే వ్యక్తి బృందావన్ కాలనీలో నిర్మాణంలో ఉన్న భవనంలో పనిచేస్తున్నాడు. బుధవారం భవనంలోని ఐదో అంతస్తులో పనిచేస్తున్న తయూమ్ మియా , ముఖేశ్ అనే మరో వ్యక్తి అక్కడున్న లిఫ్ట్ గుంతలో పడిపోయారు. దీంతో తీవ్రగాయాలపాలయిన తయూమ్ మియాను, ముఖేశ్‌ను స్థానికంగా ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.అప్పటికే తయూమ్ మియా మృతి చెందినట్లు వైద్యులు ప్రకటించారు. ముఖేశ్ తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నాడు. కనీసం సేఫ్టీ బెల్ట్‌లు లేకుండా ఐదో అంతస్తులో పనులు చేయిస్తున్న కాంట్రాక్టర్ అరిఫ్ అలీయుద్దీన్, బిల్డర్ ఫిర్దౌస్ ఖాన్‌లపై చర్యలు తీసుకోవాలంటూ గురువారం మృతుడి సోదరుడు మహ్మద్ ఖయ్యూమ్ ఫిర్యాదు చేయగా ఫిలింనగర్ పోలీసులు భారత న్యాయ సంహిత 106(1) సెక్షన్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ఆరబోసిన వడ్లను గమనించక..

దుండిగల్: ద్విచక్రవాహనం అదుపుతప్పి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. డీ. పోచంపల్లిలోని సారెగూడెం కు చెందిన చంద్రశేఖర్‌రెడ్డి(23) సర్వీస్ ప్రొవైడర్‌గా పనిచేస్తున్నాడు. మేడ్చల్ పరిధిలోని ఓ పరిశ్రమలో పనిచేసి చీకటి పడ్డాక తన బైక్‌పై ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో వస్తుండగా, దుండిగల్‌లోని డబుల్‌బెడ్రూం ఇండ్ల సమీపం వద్ద రోడ్డుపై వడ్లు ఆరబోయడంతో చంద్రశేఖర్‌రెడ్డి గమనించలేదు. ఈ క్రమంలో వాటి పైనుంచి వెళ్లడంతో బైక్ అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. తలకు బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే చనిపోయాడు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
SHOP FOR SALE
★ తాండూరు పట్టణంలో గాంధీచౌక్ స్వర్ణకార మార్కెట్ ఘనాపూర్ వార్డునందు 12 x 20 – 10 x 20 రెండు షాపులు అమ్మకానికి కలవు. సంప్రదించండి: 9701017002 / 8978747184.
NT-Tandur
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

# రైళ్లలో చోరీలు చేస్తున్న దొంగ అరెస్టు

## 26 తులాల బంగారం స్వాధీనం



సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న రైల్వే డీఎస్పీ ఎస్ఎన్ జావేద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్

మారేడ్‌పల్లి, నవంబర్ 21: రైళ్లలో ప్రయాణికుల బంగారు ఆభరణాలను దొంగతనాలకు పాల్పడుతున్న అంతరాష్ట్ర దొంగల ముఠా సభ్యుల లో ప్రధాన నిందితుడిని సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రైల్వే డీఎస్పీ ఎస్ ఎన్ జావేద్, రైల్వే ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్ లు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఢిల్లీకి చెందిన రణవీర్ సింగ్ (48) వృత్తి రీత్యా డ్రైవర్. కొంతకాలంగా రణవీర్ సింగ్ రైళ్లలో దొంగత నాలకు పాల్పడుతూ.. ఢిల్లీ, కర్ణాటక, రాజస్థాన్ రైల్వే పోలీసులకు చిక్కి జైలుకు కూడా వెళ్లొచ్చాడు. హర్యానాకు చెందిన సంషీర్, సుమిత్, సత్వీర్, జగదీశ్‌లతో చేతులు కలిపి చోరీలను ముమ్మరం చేశారు. కాగా గురువారం నాడు నిందితుడు రణవీర్ సింగ్ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా.. పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. పలు రైళ్లలో చోరీ చేసినట్టుగా నిందితుడు అంగీకరించాడు. అతని వద్ద నుంచి 26.5 తులాల బంగారు ఆభరణాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మిగిలిన నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్టు పోలీసులు వెల్లడించారు. నిందితుడిని పట్టుకోవడంలో చాకచాక్యంగా వ్యవహరించిన రైల్వే పోలీసు సిబ్బందిని రైల్వే డీఎస్పీ అభినందించారు. ఈ మీడియా సమావేశంలో రైల్వే ఎస్ఐ మాజీద్, రైల్వే పోలీసు సిబ్బంది మహిపాల్‌రెడ్డి, సుఖ్‌దేవ్, వేణుగోపాల స్వామి, బి. హరిలాల్, నాగు బాషా, కె. భవానీ శంకర్, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సరస్వత్ తదితరులు పాల్గొన్నారు.

# ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేస్తున్నది

## జైళ్ల శాఖ ఐజీ మురళీబాబు, డిప్యూటీ ఐజీ శ్రీనివాస్‌లు

చర్లపల్లి, నవంబర్ 21 : సిబ్బంది, ఖైదీల సంక్షేమానికి జైళ్ల శాఖ కృషి చేస్తున్నదని జైళ్ల శాఖ హైదరాబాద్ రెంజ్ ఐజీ మురళిబాబు, జైళ్ల శాఖ హైదరాబాద్ రెంజ్ డీఐజీ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు. చర్లపల్లి కేంద్ర కారాగారంలో పునశ్చరణ(రిట్రీట్) కార్యక్రమంను డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ టీ.రఘునాధస్వామితో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర కారాగారంలోని సిబ్బంది సమస్యలను పరిష్కరించడంలో జైళ్ల శాఖ కృషి చేస్తున్నదన్నారు. ప్రతి సంవత్సరం సిబ్బంది కోసం పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నామని, సిబ్బంది అంకిత భావంతో పనిచేసి జైళ్ల శాఖకు గుర్తింపు తీసుకురావాలని వారు సూచించారు. తెలంగాణ రాష్ట్ర డైరక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ అధికారి డాక్టర్ టీ.రఘునాధస్వామి మాట్లాడుతూ ఖైదీలు, సిబ్బందికి కావాల్సిన సౌకర్యాలు కల్పించడం హర్షనీయమన్నారు. ఈ సందర్భంగా సంవత్సర కాలంగా జైలులో చేపట్టిన సంస్కరణలు, ఖైదీలు, సిబ్బంది సంక్షేమానికి తీసుకున్న చర్యల గూరించి చర్చించారు. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కేంద్ర కారాగారం, ఖైదీల వ్యవసాయక్షేత్రం సూపరింటిండెంట్లు రామచంద్రం, సమ్మయ్యలతో పాటు డిప్యూటీ సూపరింటిండెంట్లు, జైలర్లు, డిప్యూటీ జైలర్లు, వార్డెన్లు, సిబ్బంది, ఖైదీలు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
Telangana Today
FOR LOCAL TO GLOBAL NEWS
పుట్టినరోజు, పదవీ విరమణ, వార్షికోత్సవ శుభాకాంక్షలు,
వర్ధంతి, జయంతి, లీగల్ నోటీసులు
మరియు ఇతర ప్రకటనల కొరకు
ఈ దిగువ తెలిపిన నెంబర్లపై సంప్రదించగలరు.
ప్రకటనల విభాగం సెల్: 80966 77655
వికారాబాద్/పరిగి/ శంకర్‌పల్లి, తాండూర్/కొడంగల్ : 80966 77668
ఇబ్రహీంపట్నం/మహేశ్వరం : 80966 77962